# మాతృత్వమా నీకు జోహార్

రెముప్రోలు హేమ

దుర్గా విలాస్‌లో భోజనం చేసి కిళ్ళీ బిగించి అప్పుడే ఆఫీసులో అడుగు పెట్టి రిజిస్టర్‌లో సంతకం పెట్టబోతున్న - జంగారెడ్డిగూడెం గ్రౌండు వాటర్ డిపార్టుమెంట్‌లో క్లర్కు....నర్సింహానికి క్రిందటి రాత్రి అతనుంటున్న రూముగల ఆసామీ పైడితల్లి విసిరిన సూటిపోటిమాటలు గుర్తుకొచ్చేయి. గుర్తుకి రావడం కాదు, చెవుల్లో గింగురుమన్నాయి. సంతకం పెట్టబోతున్న చేతికి క్షణంపాటు పెరాలిసిస్ వచ్చినట్లనిపించింది. కాసేపు చచ్చుపడిపోయినట్లయి,మళ్ళీ మామూలు స్థితికి వచ్చి బాల్‌పాయింట్ పెన్ను ములుకు లోపలికి నొక్కి జేబులో పెట్టేసేడు.

నర్సిహం రిజిష్టర్ మూసేసేడు. పెద్దపెద్ద అంగల్తో తన సీటు దగ్గరకి నడచి తల రెండు చేతులతోను గట్టిగా అదిమిపెట్టి కుర్చీలో కూలబడ్డాడు.

'అబ్బ ... తలపోటు. మాడు చిప్ప పగిలిపోతుందేమో లేకపోతే కణతలు పేలిపోతాయో ..?బావగా మూలగబోయి. వున్నది ఆఫీసన్న సంగతి గుర్తొచ్చి ఊరుకున్నాడు నర్సింహం.

"దగ్గు.... జలుబు.... రొంప.... తలనొప్పి...."

అదేదో తలనొప్పి మందుకి.... రేడియో ప్రకటనల విభాగం నుంచి విన్పించే అడ్వర్‌టైజుమెంటుని అనుకరిస్తూ నర్సింహం సీటు దగ్గరగా వచ్చి నిలబడ్డాడు రాజారావు.

నర్సింహం నీరసంగా తలెత్తి చూసేడు. చిద్విలాసంగా నవ్వుతూ సిగరెట్ చిట్టచివరి దమ్ము లాగి మూలకి విసిరేసేడు రాజారావు. కోరమీసం కుడిచేత్తో దువ్వుతూ గార పట్టిన పళ్ళికిలించేడు. గొంతు సవరించుకుని మళ్ళీ...

"దగ్గు...జలుబు...రొంప...తలనొప్పి" అంటూ పాట లంకించుకున్నాడు.

నర్సింహానికి ఒళ్ళుమండింది. స్నేహితుడయి ఉండి సమస్యకో పరిష్కారం ఆలోచించేది లేకపోగా వెధవ్వికారాలూ వీడూను!

"ఏంటివోయ్ నీ గోల ...." కసురుకున్నాడు రాజారావుని. అతను చెక్కు చెదరలేదు, నిబ్బరంగా నిలబడే ఉన్నాడు.

"నా గోల ఏంలేదు వోయ్.'నీ గోలకాంటీన్లో చెబుదువుగాని రా వోయ్".... అంటూ నర్సింహం భుజాలు పట్టుకుని అతన్ని లేవనెత్తేడు.


"సంతకం పెట్టేవా...." వెర్రిచూపులు చూస్తున్న నర్సింహాన్ని ప్రశ్నించేడు రాజారావు.

"లేదు. లీవు పెట్టేస్తున్నా" ముక్తసరిగా జవాబిచ్చి టేబిల్‌మీదున్న ఫైలందుకుని కాజువల్ లీవు ప్రొఫార్మా తీసి నిముషంలో పూర్తిచేసి సెక్షన్ ఆఫీసరు టేబిల్‌మీదపెట్టి. "పద కాంటీన్‌కి" అన్నాడు రాజారావుతో.

ఎంతోఅవసరంతోవస్తేకానిసెలవుపెట్టడు నర్సింహం. ఫిబ్రవరి నెలాఖరు కాకుండానే సీయెల్స్ అన్నీ వాడేసుకుని ఏడుపుమొహం పెట్టుకుని విధిలేక ఆపీసుకు వస్తూ కాలంగడిపే రాజారావు అతనికి పూర్తిగా వ్యతిరేకం. 'ఈరోజిలా ధారాళంగా లీవు వదేసేదే....'

'గుంటడు నిజంగా నే ట్రబుల్స్‌లో యిరుక్కొనుంటాడు' అనుకున్నాడు రాజారావు స్వగతంగా, 'ఏమయిందబ్బా మనిషి గుండు పిక్కలా వున్నాడు. నీట్‌గా ముస్తాబయ్యాడు'– నర్సింహం బుజం మీద చెయ్యేసి కాంటీన్‌కేసి నడుస్తున్న రాజారావుని సవాలక్ష అనుమానాలు పట్టుకుని పీడించేయి. 'మళ్ళీ అబ్బాయిగారి ప్రమోషన్ ఫైలు తిరిగొచ్చిందా! మొన్నటి కాంప్‌లో 'కంపెనీ' ఇవ్వలేదని ఏయీగారు మండిపడ్డాడా! లేకపోతే డబ్బు ఇబ్బంది ఏదైనా.... అబ్బే నర్సింహం జాగ్రత్తమంతుడు. తనలాగ ప్లాను, బడ్జెట్టు లేకుండా డబ్బు తగలేసుకుని కష్టాలు కొని తెచ్చుకోడు. మరెందుకీ రోజిలా మొరోజుగానున్నాడు. ఏదో జరిగింది.' మనిషి నీరుకారిపోతున్నాడు. కుర్రాణ్ణి కంగారు పెట్టకుండా లాలించి, బుజ్జగించి విషయం తెల్సుకుని చేతనయిన సహాయం చెయ్యాలి. మనిషి ఆపదలో ఉన్నప్పుడు కాకపోతే మరెందుకు స్నేహితుడు!'రాజారావు మనసులోనే గట్టి నిర్ణయం తీసుకున్నాడు. కాంటీన్ వీరేశం చేతిలోనించి కాఫీకప్పులు అందుకుని ఒకటి నర్సింహానికిచ్చి ఒకటి తను సిప్ చేసేడు. ఒకటోసారి .... రెండోసారి ... మూడోసారి.... 'అరె .... తనకప్పు సగం ఖాళీ అయిపోయిందే. ఇంకా నర్సింహం పెదాలు కాఫీ తాకినట్లు లేదు! ఏమయింది...'

"ఏమో యేమో ఇది.... నాకేమొ ఏమొ అయినదీ".... తన సహజమయిన హాస్య



ధోరణిలో నర్సింహాన్ని 'చీరప్ చెయ్య బోయేడు రాజారావు. ఊఁహూఁ! నర్సింహంలో ఏ మాత్రం కదలిక లేదు. ఎలా వున్నవాడలాగే కాఫీ కప్పుకేసి చూస్తూ వుండిపోయేడు. మళ్ళీ కాస్సేపు తికమక పడ్డాడు రాజారావు.

'అదా.... సంగతి.... అర్థమయి పోయింది.'

"ఏంటివోయి నర్సింహం! కాఫీ కప్పులో కమల చెల్లాయి కనిపిస్తోందా!.. హెహెహె.. హహహ...."

పేద్ద విట్టు పేల్చినట్టుగా పకపక నవ్వ సాగేడు రాజారావు. నర్సింహానికి చిరాకేసింది. రాజారావుని చురచుర చూస్తూ చల్లారిపోయిన కాఫీ గటగట తాగేసి కప్పు బల్లమీద పెట్టేడు.

"వెధవ వెకిలిమాటలేనా-మనిషినీ మనసునీ అర్థం చేసుకునేది వుందా.." సూటిగా ప్రశ్నించేడు స్నేహితుణ్ని.

"అర్థం చేసుకోడమే కాదు. ఆదుకోవడం కూడా వుంది మిత్రమా! అసలు నీకొచ్చిన కష్టమేమిటో చెప్పకుండా అలా నీలో నువ్వే మండిపోయి మెలికలు తిరిగి పోతే ఎలా...."

నర్సింహం క్లుప్తంగా తన కష్టాలు వివరించేడు. కమల.... తన ప్రాణంలో ప్రాణం తనకొక్కబోయే భార్య.... తనుండే రూముకి రావడం పోవడం ఇల్లుగల పైడితల్లికి నచ్చడంలేదు. అతనికే కాదు. అసలావాడకట్టు వాడకట్టు కంతకీ నచ్చడంలేదని కూడా తను గ్రహించేడు.

తను ఎదురు పడినప్పుడల్లా చుట్టుపక్కల ఇళ్ళల్లో వాళ్ళంతా సూటిపోటి మాటలనడం 'ఏదో సాగితే పెళ్ళెందుకు' లాంటి బాణాలు విసరడం మొదలయి రెండు మూణ్నెల్లయింది. తను మాత్రం ఏం చెయ్యగలడు తన్ను కాదన్నట్లు దులిపేసుకోవడం తప్ప! కమలని తన రూముకి రావద్దు అందామా అంటే అది సాధ్యంకాదు. ఎప్పుడో పన్నెండేళ్ళనాడు కాలేజీ చదువు వెలగబెట్టే రోజుల్లో మనసులిచ్చి పుచ్చుకున్న పాపానికి. మధ్యలో కొంతకాలంపాటు విధివశాన విడిపోయినా. ఇద్దరూ మరి పెళ్ళి మాటెత్తకుండా అలాగే ఉండిపోయి ఈనాటికీ ఒకర్నొకరు ఆరాధించుకుంటున్నారు కదా!

పదేళ్ళనాడు జరగవలసిన పెళ్ళి. కొప్పు వెలమలతో కోమట్లకి వియ్యం పనికి రాదని రెండువేపుల పెద్దలూ పేచీలు పెట్టేసేక. తప్పదని తను, కమల తలొకదారి పట్టేరు. బ్రతుకు అడవిలో ప్రయాణం చేసిచేసి కొంతకాలానికి జంగారెడ్డి గూడెం ట్రాన్స్ఫర్ అయి, పెట్టేబేడా పట్టుకుని అశ్వారావు పేట బస్సెక్కిన నర్సింహానికి అదే బస్సులో ప్రయాణం చేస్తున్న కమల తారసపడింది. కలుసుకున్నారు. కష్టం సుఖం చెప్పుకున్నారు. కమల తాడువాయి హైస్కూల్లో బిఇడి. అసిస్టెంటు. అక్కడున్న హౌసింగు ప్రోబ్లెమ్ మూలాన మకాం మాత్రం జంగారెడ్డిగూడెంలోనే వుండి రోజూ స్కూలుకి వెళ్ళివస్తోంది. పునస్సమాగమం కమల నర్సింహంల ప్రేమను క్రొత్త చిగుళ్ళు వేయించింది. కులాంతర వివాహం కాదనే పెద్దలు రెండు వైపులవాళ్ళు అంతరించిపోయేరు. ఉన్న వాళ్ళని లెక్కచేసే స్థితినించి ఇద్దరూ ఎదిగి పోయేరు. కాబట్టి ఇద్దరిలో సరికొత్త అవగాహన కుదిరింది. పెళ్ళి చేసుకుని ఇంటివాళ్ళమయిపోదామని నిర్ణయానికి కూడా వచ్చేరు. కాని మధ్యలో ఈ కానిపోని మాటలు పడవలసి వస్తోంది.—

అంతా విని గజం పొడుగు నిట్టూర్పు వదలేడు రాజారావు. డిటెక్టివ్ వేలాయుధం లాగ కుడిచేతి మునివేళ్ళతో రెండుసార్లు నుదుటిమీద కొట్టుకున్నాడు.

"పోనీ గది మార్చేస్తావనుకో .... అక్కడా ఇదే గొడవ మొదలయితే! ఎలాగూ పెళ్ళి చేసుకునేదేగా.... ఇప్పుడే చేసేసుకుంటే"....

"అది కుదర్దువోయి" రాజారావు మాటలు పూర్తి కాకుండానే అందుకున్నాడు నర్సింహం.

"నీకు తెలీందేముంది! మా చెల్లెమ్మ పెళ్ళికి చేసిన అప్పులింకా తీరనేలేదు...." నీళ్ళు నమిలేడు.

"అబ్బోసి! అదో పేద్ద అడ్డం అన్నట్లు మాట్లాడుతున్నావే! ఇద్దరు ఉద్యోగాలు చేస్తుంటే ఆపాటి అప్పులు తీర్చడం

బ్రెమ్మాండమటయ్యా! ఇంత కాలం నీ కోసం ఎదురుచూసిన స్త్రీకమల నీ మాట కాదని నీ ఆర్థికచిక్కుల్లో సహకరించకుండా పోతుందా?"

అదీ నిజమే నన్పించింది నర్సింహానికి.

"ఇదిగో బ్రదరూ! నువ్వు అప్పులన్నీ తీర్చేసి....డబుల్ కాట్సు డవెలప్ పరుపులూ గాస్ పొయ్యి.... గ్రైండరూ కొనేసుకున్నాక తీరుబడిగా పెళ్ళాడి కాపురం పెట్టుకుందామనుకుంటున్నావేమో! ఈ తతంగం ముగిసేసరికి "పెళ్ళి" అవసరం ఉండదిక- ఏ వయసందం ఆ వయసుతోనే పోతుంది.. కాబట్టి కామ్రేడ్! ఇవేళ ఎలాగూ సెలవు పెట్టేవుగా! తిన్నగా తాడువాయి చెక్కెయ్. నువ్వు....కమల.... సంగతులు చర్చించుకోండి. నిర్ణయం తీసుకోండి. అదుగో.... మన సెక్షనాఫీసరు నాకేసి కోపంగా చూస్తున్నాడు. పదకొండుంబావు అయినా డ్యూటీకెళ్ళకుండా లీవుపెట్టినవాడితో హస్కు కొడుతుంటే ఊరుకుంటాడేమిట్లే!! నేపోతున్నా! సాయంత్రం చలపతిని తీసుకుని నీ రూముకొస్తాను. మీరిద్దరూ చిన్న తిరుపతికి ప్రయాణం అయి వుండండి! రేపే నీపెళ్ళి.... మరి నే పీకెక్కేస్తా...."


రాజారావు గబగబ ఆఫీసు బిల్డింగు వేపు నడిచేడు. నడుస్తూ ఏదో గొణిగేడు. గొణుగుతూనే నర్సింహాన్ని ఇంటికి వెళ్ళిపొమ్మని పొంజ్ఞ చేసేడు.

నర్సింహం ఆఫీసు గేటు దాటి బయటకి నడిచేడు. రాజారావు బోధ అతని బుర్రకి పట్టేసింది. వెంటనే కమల మెడలో పుస్తె కట్టడమే సరయిన పరిష్కారం. అపనిందలు. మనఃక్లేశాలు ఎక్కడివక్కడ మాసిపోతాయి.

వెంటనే తాడువాయి బయల్దేరాలనుకున్నాడు. 'సాయంత్రం కమల ఎటూ రూముకి వస్తుందికదా .... నచ్చచెప్పవచ్చు....' అనుకుని వూరుకున్నాడు. నచ్చజెప్పడం ఎందుకు! ఆమే యెప్పటికప్పుడు కంగారుపడుతోంది పెళ్ళికోసం. తనే వాయిదాలు పెడుతున్నాడు. తనిప్పుడు సంగతి చెప్పగానే ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ "ఊఁ" అంటుంది.

నా కమల....నా ప్రాణం....' కమలని గురించి తీయని తలంపు రాగానే పులకించిపోయేడు నర్సింహం. అతని పెదాలమీద చిరునవ్వు తాండవించింది.

అప్రయత్నంగా బ్యాంకువేపు నడిచేడు. చెల్లెమ్మ పెళ్ళి కోసం చిన్నాన్న దగ్గర తీసుకున్న వడ్డీ లేని అప్పు పెద్ద మొత్తం పెద్ద మొత్తంలాగనే పువ్వుల్లో పెట్టి తిరిగి ఇచ్చేద్దామని కూడబెడుతున్న డబ్బులోంది వెయ్యి రూపాయలు డ్రా చేసేడు. పద్మా షోరూమ్‌లో మంచి ఎర్రపట్టు చీర కమల కోసం కొన్నాడు. తనకోసం కోరా రంగు, జరీ అంచు పంచెల జత, తెల్ల టెరీకాటన్ లాల్చీ గుడ్డ కొన్నాడు. ఫేమస్ టైలర్స్‌కి వెళ్ళి లాల్చీ కొలతలిచ్చి రాత్రి పదోగంటకల్లా కుట్టి అందించమని మరీ మరీ చెప్పేడు. 'అరె.... మరి కమల పట్టుచీర మీదకి జాకట్టు కుట్టించేదెలా!' కాస్సేపు తికమకపడ్డాడు. 'సరే.... రవికల గుడ్డ ఆమె కందిస్తే.... ఇరుగు పొరుగు లేడీ టైలర్స్‌ని పట్టుకుని ఆమే తంటాలు పడుతుందిలే....' అనుకున్నాడు. గంగాలమ్మ గుడిమీదుగా పూలకొండయ్య కొట్టుకి నడచి రెండు పెళ్ళిదండలు కట్టమని ఆర్డరిచ్చేడు. తిరిగి వచ్చేటప్పుడు అమ్మవారి గుళ్ళో గంట కొట్టి ప్రార్థించేడు."మా పెళ్ళి నిర్విఘ్నంగా జరగనీ తల్లీ.... నీకు భోగం చేయించుకుంటాం"....



కొవ్వొత్తుల ముగ్గు

—చిత్రం : బోనేపల్లి ఝాన్సి

**తేలికపడిన మనసుతో గాలిలో తేలిపోయే ఊహలతో ఇల్లుచేరేడు నర్సింహం.**

ఒంటిగంట కావస్తోంది. మిట్ట మధ్యాహ్నం ఎండ నెత్తి కాలుస్తోంది. 'పేటలో ఆడవాళ్ళంతా ఇళ్ళల్లో దూరి నిద్ర కుపక్రమించేరు కాబోలు. మగవాళ్ళంతా పనుల్లోకి పోయుంటారు. రోజూ తను ఆఫీసు నించి తిరిగొచ్చేటప్పుడు గుమ్మాలలో జేరి గుసగుసలుపోయే లలనామణులు, రేప్పు కమలనీ, తననీ పట్టుబట్టల్తో, పెళ్ళిదండల్తో చూసి బిక్కచచ్చిపోతారల్లే ఉంది....'

తాళంతీసి గదిలో అడుగుపెట్టి నాలుగు మూలలా పరికించేడు. గదంతా చిందర వందరగా ఉంది.మంచంమీదపడున్న లుంగీ తీసి కట్టుకుని ఆఫీసు బట్టలు హేంగర్‌కి తగిలించేడు, నడుం వాల్చుదామని మంచం మీద ఒరగబోయేడు. గడచినవారమంతా తొడిగి మాపేసిన బట్టలన్నీ మంచంమీద కుప్పగా ఉండి కంపు కొడుతున్నాయి. చివాల్న లేచి కుళ్ళు బట్టలన్నీ సర్దేసేడు. రూమంతా నీట్‌గా సవరిద్దామనుకున్నాడు కాని.... 'అవన్నీ చూసుకునేటందుకు అర్థాంగి వస్తోందిగా! నాకెందుకు శ్రమ.'

బయట వేడిగాలి ఎక్కువగా వుంది.... కిటికీ మూసి కాస్సేపు విశ్రమిస్తే.... సాయంత్రం రాజారావు, చలపతి వచ్చేక.. కమలని కూడా వెంటబెట్టుకుని బజారెళ్ళి... రావాకు పుస్తెలు.. మట్టెలు.. నల్లపూసలు కొని....'

ఆనందంగా.. మత్తుగా, కళ్ళు మూతలు పడుతుండగా— కిటికీ మూయబోతూ బయట ప్రపంచం మీద ఓ చూపు ప్రసరించేడు నర్సింహం!

ఎండ కళ్ళు చెదిరేలా వుంది. నిశ్శబ్దంగా వున్న వీధిలో ఎక్కడో కారం కొడుతున్న చప్పుడు దూరాన్నుంచి వినపడుతోంది. జన సంచారం మాత్రం లేదు. కాని అల్లంత

దూరాన సగం సగం కడుతూ ఆపిన ఇంటి బాపతు "బేస్మెంటు" మీద ఇద్దరు చిన్న పిల్లలు ఆడుకుంటూ కన్పించేరు.

చంటివాళ్ళకి ఎండా కొండా ఉండదు కాబోలు. నిశ్చింతగా ఆడుకుంటున్నారు. ఇద్దరూ కూడా అయిదారేళ్ళు మించి వయసున్నవాళ్ళు కాదు. పిల్లవాడి వంటిమీద మొలతాడు మినహా మరి నూలుపోగు లేదు. నల్లగా, దుక్కగా, దిసగా, పోతపోసిన విగ్రహం లాగున్నాడు. నేలమీదనుంచి దోసిళ్ళతో మట్టి తీసి మల్లెపూలు ప్రేయసి మీదికి చల్లే రసికుడిలాగ పిల్లదాని మీదకి చల్లుతూ పకపక నవ్వుతున్నాడు.

పిల్లదాని వళ్ళు కేబరా డాన్సరు మాదిరి అర్ధ నగ్నంగా వుంది. చిన్న సిగ్గుబిళ్ళ వేలాడుతున్న మొలతాటిలో మాసిపోయిన అంగోస్త్రం గుడ్డదోపి పైట వేసుకుంది. తైల సంస్కారంలేని దాని జుట్టు చిలకలు పీకిన తాటి టెంకలాగున్న దాని బుర్రకాయ మీద గాలికి యెగురుతోంది. పిల్లగాడి నవ్వుతో శృతి కలుపుతూ ఆడుతోంది. మధ్యమధ్య చంకలోవున్న "పౌడరు డబ్బా" అబ్బాయిని ఎగేస్తూ దిగేస్తూ .... సముదాయించుకుంటూనే .... తనుకూడా గుప్పెళ్ళతో ఇసకతీసి పిల్లగాడిమీదికి విసురుతోంది.

ఆ యిద్దర్నీ పరిశీలిస్తుంటే నర్సింహం మనసు ఏదోలాగ అయిపోయింది.

లేచి మళ్ళీ కిటికీ తెరిచాడు. నిప్పులు చెరిగే ఎండ ఎర్రగా కనిపిస్తోంది. వీధి ఇందాకటికన్న నిర్మానుష్యంగా వుంది.

ఆ నగ్నసుందరి, బోడిగాడు అలాగే ఆడుతున్నారు. వేడివేడి ఇసకతో తలంబ్రాలు పోసుకుంటున్నారు.


నువ్వే ముందు పోచేవు....
నువ్వే ముందు పోచేవు....
నువ్వే....
నువ్వే....
హి హి హి .... హ హ హ ....
ఆడుతూ, కేరింతలు కొడుతూ .... తరుముకుంటున్నారు.

"మీ ఆటలు చల్లగుండ" నర్సింహం తెరచిన కిటికీ తెరచినట్లే ఉంచి మంచంమీద ఒరిగేడు. రెండుగంటలు దాటింది. 'ఇంకో రెండు మూడు గంటల కాలంలో కమల వస్తే....'

చక్కటి కునుకులోకి నింపాదిగా జారుకుంటున్నాడు నర్సింహం. బడలిన శరీరం, తేలికపడిన మనసు.... పోటీ పడుతున్నాయి. కళ్ళు అరమూతలూ పడుతున్నాయి.

ఇంతలో....

పెద్ద పెట్టున ఏవో కేకలు.... ఏడ్పులు విన్పించినట్లయి ఉలికిపడి లేచేడు. కిటికీలో




నించి చూస్తే రాములమ్మ నగ్న సుందరినెందుకో బాదేస్తూ కన్పించింది.

"దిక్కుమాలిన గుంటా....గడీకో బాబు నిమ్మంటె నేనెక్కడ తెచ్చేదీ! పొద్దున్న పీటకొయ్యిచ్చినాను. పారేసినావు. పద.... ఇంటికి.... ఎండగుంది .... తొంగుదో.... సందలడినాక మంచి బాబు నిచ్చేస్తాన్లే.... రాయే...." బుజ్జిని గుంజుతోంది. బుజ్జితల్లి పట్టు విడిపించుకోవాలని గింజుకుంటోంది.

"బాబిందులో నున్నాడూ...." నూతికేసి చూపిస్తూ ఏడుస్తోంది.

"ఏమిటి రాములమ్మా! పిల్లనలా ఏడ్పించేస్తున్నావు!" కిటికీ వెనక నిలబడే పలకరించేడు నర్సింహం.

"ఏడిపించకుంటె.... మరేటిసెయ్యమంతరండీ.... దీనికి కంగారెక్కువయిపోనాది. కుసింతనేదు, కొడుకులు కావాలంతన్నాది. పాత పౌడ్రడబ్బా ఇచ్చినాను, పారేసినాది. ఎక్కడ తెచ్చేదీ.... లెగేస్.. ముండకానా.. నడింటికి.... తొంగున్నేచినాక మంచి బాబు నిస్తాన్నే!"

రాములమ్మ బుజ్జిని జబ్బపట్టుకుని ఈడ్చింది. బుజ్జి ఆపన్నొక రాగం ఆలాపిస్తూ నేలనూతి దగ్గరకి పరుగుపెట్టింది.

"బాబిందులో నున్నాడూ...."నూతిలోకి చూస్తూ రాగం లంకించుకుంది. రాములమ్మ నేలమీద పడున్న పౌడరు డబ్బాతీసి బుజ్జికి అందిస్తూ.... "ముదనష్టంముండా! ఇడిగో నీ బాబు.... రా యింటికి" .... బలంగా రెక్కపట్టుకుని బరబరాఇంటివేపు లాక్కెళ్ళబోయింది. బుజ్జి కాళ్ళు నేలకేసి కొట్టుకుంటూ తల్లి చేతి పట్టు మళ్ళీ విడిపించేసుకుని పరుగున నూతి వారచేరి గంతులు వేస్తూ పెద్దగా అరవడం మొదలుపెట్టింది.

"బాబిందులో నున్నాడు...బాబున్నాడూ.. బాబిందులో నున్నాడూ...." గంతులేసింది. జుట్టు పీక్కుంది. చివరకి వేడి ఇసకలోపడి దొర్లడం మొదలు పెట్టింది.

రాములమ్మ విసిగిపోయింది. దగ్గరలో వున్న ముళ్ళకంప విరచి సవరయిన జూక తయారుచేసింది.

"ముండా.... లేచినావా లేదా...." బుజ్జిని రెండు తగిలించింది....అంతా తిలకిస్తున్న నర్సింహానికి బుజ్జి ఏడుపులో ఏదో అర్థం స్ఫురించింది. అతని గుండె గుభిల్లుమంది.

'కొంపతీసి ఆ నల్లసిద్ధి బోడిగుండుగాడు గాని నూతిలో పడలేదుకదా'.... "రాములమ్మా! ఇందాక బుజ్జితో ఆడేదే.... బోడిగుండుగాడు.... ఏడీ ..." రాము బయటకొచ్చి అరిచేడు.


"ఇంటికెల్లిపోనాదేమో బాబూ! నా కూతురుముందకే పోగాలమొచ్చినాది .... అడింటికే యెల్లిపోయుంటాడు...."

కొంచెం ఏడుపుకి గావ్ ఇచ్చి బుజ్జి తల్లి మాటలు వింది.

"ఆఁ...ఆఁ....ఆఁ.... ఇంటికెల్లిపోనేదు. బాబుగాడిందులో నున్నాడూ....ఊఁ. ఊఁ".

అర్థమయిపోయింది నర్సింహానికి. కుర్రాడు నూతిలో పడ్డాడు. ఇందాక తనకి కునుకు పడుతుంటే నూతిలో ఏదో పడిన చప్పుడయింది. అంతా అయిదు నిముషాలు కాలేదు....' అతనింకేమీ ఆలోచించలేదు. రాములమ్మనింకేం ప్రశ్నించలేదు. అరుగుదిగి పరుగు పరుగున నూతిదగ్గరకొచ్చి తొంగిచూసేడు. అతని అనుమానం ధృవపడింది. క్షణంలో కర్తవ్యం నిర్ణయించుకున్నాడు. కన్నుమూసి తెరచేలోపున లుంగి విప్పి గట్టుమీద పడేసి కట్‌డ్రాయరుతోనే నూతిలో దూకాడు.

ఎనిమిదడుగుల కైవారమున్న నుయ్యే కాని మార్చినెల మొదట్లోనే నీరు పాతా



చిత్రం : ఆర్. విశ్వనాథ్

శానికి అంటుతూ మొలలోతు కంటె ఎక్కువ లేదు. నర్సింహం చాలా ఒడుపుగా దూకినా, రాతి కట్టడం తాలూకు గట్టితనం అతని వంటికి బాధకల్గించింది. పైడితల్లి తమ్ముడు నూకరాజు అన్న ఇంటికి ఎదురుగా తనూ ఇల్లు కట్టుకోవాలని "నాంది"గా నుయ్యి తవ్వించేడు. ఇంటి పునాదులున్ను-నూతి లోపల కట్టడమున్ను పూర్తయ్యేసరికి అతని దగ్గర డబ్బు అయిపోయింది. ఇల్లు పూర్తి కాలేదు. నూతిగట్టు కూడా అడుగున్నరకంటె ఎత్తు పెరగలేదు. ఎప్పుడో ఇలాంటి ప్రమాదం వస్తుందని నర్సింహం అనుకుంటూనే వున్నాడు. అది జరగనే జరిగింది.

ముక్కు రంధ్రాలు ఎడంచేత్తో బిగపట్టి నీటిలో ములిగేడు నర్సింహం. కాళ్ళకింద ఇసక కూరుకు పోతోంది. ఊపిరి సలప లేదు. అయినా ఓపిగ్గా నీటి అడుగు ఇసక దువ్వేడు. కాలికేం తగిలినట్లు లేదు. క్షణం పాటు బుర్ర నీటిపైకి తేల్చి ఊపిరితీసుకుని మళ్ళీ నీటి అడుగుకి బుడుంగున ములిగేడు. ఈసారి పైకి తేలేటప్పుడు గుండుగాణ్ని లేవనెత్తేడు. వాణ్ని పైకి రెండుచేతులతోను ఎత్తుతూ మొలలోతు నీటిలో నూతిమధ్యగా నిలబడ్డాడు.

గుండుగాడు బ్రతికే వున్నట్లు నిరూపిస్తూ ఊపిరి తీసుకుంటున్నాడు. డొక్క ఎగ రేస్తున్నాడు.

'త్వరగా నిచ్చెన పడేస్తే బావుణ్ను!'

"రాములమ్మా"— గొంతు చించుకుని అరవబోయేడు నర్సింహం. కాని దవడలు కరుచుకుపోయినట్లయి అతని మాటలు అతని గొంతులోనే వుండిపోయేయి.

ఏవో కేకలు, బొబ్బలు విన్పిస్తున్నాయి. గుండుగాడి తల్లి.... నూకరాజు పెళ్ళాం.... గవిరమ్మ శోకాలు వినిపిస్తున్నాయి.

"నా కొడుకో.... నా కొడుకో...."

హృదయవిదారకమయిన రోదన. దానితోపాటు జనం హడావుడిగా పరుగులెడుతున్న ధ్వని:

జనం నూతిగట్టు చుట్టూతా చేరిపోయేరు. గుండుగాణ్ని రెండు చేతులతో ఎత్తి పట్టుకుని నీటిమధ్యగా నిలబడిఉన్న నర్సింహాన్ని వింతగా చూస్తున్నారు.

"బాబూ తమరొక్క సెణంపాటలగె నిలబడండి.... నిచ్చెన నూతిలో దింపుతాం.... ఒరేయ్ నిచ్చెన తెంద్రా...." పైడితల్లి అరుస్తున్నాడు.

మోకుతాడు కట్టిన నిచ్చెన నూతిలో దింపేరు. నర్సింహం కుర్రాణ్ని భుజాన పడేసుకుని నాలుగుమెట్లేక్కేడు. ఇంతలో మరో మోకుతాడుకు వేలాదే మరో నిచ్చెన. నిచ్చెనతోపాటు గుండుగాడి తండ్రి నూకరాజు.... నర్సింహం చేతిలోనించి పై మెట్ల మీదున్న నూకరాజు.... నూకరాజు చేతిలో నించి పైడితల్లి.... అతని చేతిలో నించి గవిరమ్మ.... అంచెలంచెలుగా.... నల్లసిద్ది.... బోడిగుండు.... సుబ్బిగాడ్ని అందుకున్నారు. అరక్షణంలో నూకరాజు, నర్సింహం పైకివచ్చేరు.

గవిరమ్మ గుండెలు బాదుకుంటోంది. "నా కొడుక్కేటయిపోతన్నాది నాయనో... నా కొడుకో".... దిక్కులు పిక్కటిల్లేలాగ అరుస్తోంది

"ఊరుకోవేస్".... మరదల్ని కసిరేడు పైడితల్లి. గుండుగాడ్ని నేలమీద బోర్లా పడకేసి వీపుమీద ఒక్క తొక్కు తొక్కేడు. వాడి నోటిలోనించి "బొళుకు బొళుకు" మంటూ నీళ్ళు బయటకొచ్చేయి. ఈ లోపున పేటలో ఆడవాళ్ళంతా అక్కడ చేరిపోయేరు. తాటాకుమంట రగిల్చి గుండుగాడి వళ్ళు వెచ్చన చేసేరు. వెల్లుల్లిపాయలు ముద్దనూరి వాడి అరికాళ్ళలో పూసేరు. పసుపు సూనెతో జేర్చి వాడి అరచేతులలో రుద్దేరు. తెలిసిన నాటువైద్యాలన్నీ చేసి గుండుగాణ్ని అయిదు నిమిషాల్లో తెప్పరిల్లజేసేరు. వాడు

కొంచెంగా అటు యిటు కదిలేడు. వాడి కదలికలు చూసి మరింత గుండె బాదుకుంది గవిరమ్మ.

"నా కొడుకో.... ఎంతపన్తరిగినాదిరా.... నాయనో !...."

"నీ కొడుక్కొచ్చిన పెమాదం లేదు లేయే.... గవిరా.... మన నర్సిమ్మం బాబు దేవుడినాగ కాపాడినాడు.... బాబూ.. నా తమ్ముడి కొడుకుని....నాకూ నా తమ్ముడికీ ఇంత పేరు నిలబెట్టే ఒక్కగానొక్క మొగ మొక్కని రచ్చించినారు.... తమ ౠణం..." చెప్పుకుపోతున్నాడు పైడితల్లి.

నర్సింహం పెదాలమీద పేలవమయిన నవ్వురేఖ వెలసింది.

'అమాయకులు వీళ్ళంతా. నేనా గుండుగాణ్ని రక్షించింది! పుడుతూనే పిల్లవాడికి పాలియ్యడం నేర్చేసుకునే ఆడమనసు కాపాడింది. లేకపోతే యేమిటి! బుజ్జి పెద్ద పెట్టున గోలపెట్టకపోతే తనసలు నిద్ర లేచేవాడా.. నూతిలో దూకేవాడా.. ఏదీ.... బుజ్జెక్కడ !'


నర్సింహం కళ్ళు నగ్నసుందరి కోసం వెతికేయి. అది హాయిగా అల్లంత దూరాన ఆడుకుంటోంది. స్నేహితుణ్ని కాపాడేనన్న గొప్ప కాబోలు— కేరింతాలు కొడుతోంది. రాములమ్మ చీరకొంగు పట్టుకుని గుండ్రంగా తిరుగుతూ, మధ్య మధ్య అంగోస్త్రం పైటలోకంటా పౌడరు డబ్బా పిల్లాణ్ని దోపి పాలు కుడపడానికి ప్రయత్నిస్తోంది.

ఆ దృశ్యం చూస్తుంటే నర్సింహం వళ్ళు పులకించిపోయింది. 'అమ్మదనంలో ఎంత కమ్మదనం వుంది!

ఆకాశంలో గ్రద్దలు తిరుగుతుంటే రెక్కల కింద పిల్లలని పొదవిపట్టుకునే కోడిపెట్ట మొదలు.... వచ్చీరాని మాటల పసిపాపదాకా—

ఆడజాతి జాతికే తలమానికం!'

'కమలా.... కమలా....నువ్వు గమ్మన నా అర్థాంగివికా.... అటుపయిన మాతృమూర్తివికా .... ఇదిగో.... ఈ బుజ్జిలాంటి.... లోకరక్షణాదక్ష అయిన మరో మాతృమూర్తికి జన్మనియ్య...'



తాతయ్య ముగ్గు

—బోనేవల్లి ఝూన్సి

# అది రాత్రి

అది రాత్రి
ఆనందోత్సాహాల సుమాలు, ధాత్రి
కురిసిన రాత్రి
ప్రతి గుండెలో
గులాబీలు విరిసిన రాత్రి
వింగి తారకల మైత్రి
కొనివచ్చే రాత్రి,
అది ధాత్రి
క్రిస్మను రాత్రి



చర్చి శిఖరాన, ఆ నీలి ఆకసాన
కాంతులు చిమ్మే
శాంత గంభీర సంకేతం సిలువ
ఏసునాధుడు వెల్గించిన దీపిక ది
జీవనానంద గీతిక ది-సంకేతిక ది
నడిరేయి జగతి మేలుకుంటుంది
స్మితహాస చంద్రికలు చల్లుకుంటుంది
అది ధాత్రి ।
క్రిస్మను రాత్రి ॥

—కె. బి. డేవిడ్ లివింగ్‌స్టన్